సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 9 । మార్చి । 2025



సోమశిలలో 56.866 టీఎంసీల నిల్వ
సోమశిల: జలాశయంలో శనివారానికి 56.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 2300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు	(10 గ్రా)	రూ.88,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)		రూ.8,040
3 శాతం జీఎస్టీతో		రూ.8,281
నవర (8 గ్రా)		రూ.66,248

గరిష్టం/కనిష్టం
35.6 /23.5

వాతావరణం
ఆదివారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 63 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం	సోమవారం
సా: 6.20	ఉ: 5.02

సీడ్.. ఫ్రాడ్

రెండున్నర దశాబ్దాల క్రితం ఆక్వా రంగాన్ని టైగర్ రొయ్యల సాగు ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసింది. అయితే కొన్నాళ్లకు నాసిరకం సీడ్ రావడంతో టైగర్ రొయ్య సాగునే పూర్తిగా కనుమరుగు చేసింది. ఇప్పుడు వెనామీ వంతైంది. నకిలీ సీడ్ హేచరీలు, ఫీడ్ వ్యాపారుల చేతిలో చిక్కి ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కొన్ని హేచరీలు నాణ్యత లేని రొయ్య పిల్లలను అంటగడుతున్నాయి. చెరువులో వేసిన కొన్ని నిమిషాలకే సగం పిల్లలు చనిపోతుంటే.. మిగిలిన సగం వైరస్‌లతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేసి రైతులు అప్పుల పాలవుతున్నారు.

➡ ముత్తుకూరు మండలం పొలంరాజుగుంటకు చెందిన కొందరు రైతులు బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని రేబాలలోని గణేష్‌సాయి తిరుమల హేచరీలో వెనామీ సీడ్ కొనుగోలు చేశారు. ఒక్కో రొయ్య పిల్లను రూ.30 పైసలు చొప్పున కొనుగోలు చేసి లక్షల్లో పిల్లలను చెరువుల్లో వదిలారు. 80 నుంచి 100 కౌంట్ వరకు పెరగాల్సిన రొయ్య పిల్లలు 275 కౌంట్‌కే పరిమితమయ్యాయి. నకిలీ రొయ్య పిల్లల వల్ల ఆ గ్రామంలోని రైతులు దాదాపు రూ.2 కోట్లు నష్టపోయారు.



జిల్లాలోని 69 హేచరీల్లో 18కే అనుమతి

- కృత్రిమ పద్ధతిలో వెనామీ రొయ్య పిల్లల ఉత్పత్తి
- 22,104 ఎకరాల్లో రొయ్యల సాగు
- నాసిరకం సీడ్‌తో నష్టపోతున్న ఆక్వా రైతులు
- ముత్తుకూరు మండలంలో రూ.2 కోట్ల మేర రైతులకు నష్టం
- ప్రశ్నార్థకంగా మారుతున్న ఆక్వా సాగు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో కరేడు నుంచి మనుబోలు వరకు సముద్ర తీరంలో ఆక్వా సాగు ఉంది. మొత్తం 33,104 ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా ఇందులో 22,104 ఎకరాల్లో రొయ్యలు, మిగిలిన ఎకరాల్లో చేపలు పెంచుతున్నారు. నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తికి కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ కొన్ని మార్గ దర్శకాలను రూపొందించింది. ఎంపెడా ద్వారా అనుమతి పొందిన హేచరీలకు బ్రూడర్స్ (తల్లి రొయ్యలు)ను సరఫరా చేస్తోంది. వీటి ద్వారా ఒక దఫాకు ఒక మిలియన్ సీడ్ ఉత్పత్తి అవుతోంది. ఒక బ్రూడర్‌తో 3, 4 సార్లు కంటే ఎక్కువ సార్లు గుడ్లు పెట్టించకూడదు. అంత కంటే ఎక్కువ సార్లు పెట్టిస్తే నాసిరకం పిల్లలు ఉత్పత్తవుతాయి. ఆరోగ్యంగా ఉన్న బ్రూడర్స్ నుంచి గుడ్లు పెట్టించి పొదిగించిన సీడ్ నాణ్యతగా ఉంటుంది. బ్రూడర్స్ నుంచి 1, 2, 3, 4 దఫాల్లో వచ్చిన రొయ్య పిల్లలు నాణ్యతతో పాటు పెరుగుదల ఒకే విధంగా ఉంటుంది. బ్రూడర్స్ ఎంపెడా నుంచి కొనుగోలు చేయడానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. దీంతో హేచరీల యజమానులు అత్యాశకు పోయి కొన్ని రకాల మందులను వినియోగించి 10 నుంచి 12 సార్లు కృత్రిమంగా గుడ్లు పెట్టించి పిల్లలను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. మొదటి నాలుగు దశల్లో పొదిగించిన సీడ్‌తో 11, 12 దశల్లో వచ్చిన రొయ్య పిల్లలను కల్తీ చేసి రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతుకు ఇచ్చిన రొయ్య పిల్లలు చెరువులో వదిలితే 50 శాతానికిపైగా చనిపోతున్నాయి.

జిల్లాలో 18 హేచరీలకే అనుమతి
జిల్లాలో 69 హేచరీలు ఉండగా వీటిలో 18 హేచరీలకే ఎంపెడా అనుమతి ఉంది. మిగతా హేచరీల్లో అనధికారికంగా సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. అనుమతి లేని హేచరీలకు ఎంపెడా బ్రూడర్స్ సరఫరా చేయకపోవడంతో వీరు సముద్రంలో దొరికే రొయ్యలను కొనుగోలు చేసి, వాటి ద్వారానే సీడ్ ఉత్పత్తి చేస్తున్నారని సమాచారం. ఇటువంటి హేచరీలు తాము చెన్నై నుంచి గుడ్లు తెచ్చి పొదిగించామని, నేచురల్ (ఎకో) సీడ్, హైజెనిక్ (పరిశుభ్రమైన) సీడ్ అని రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు.



నకిలీ సీడ్‌తో ఎదుగుదల కోల్పోయిన వెనామీ రొయ్యలు

నష్టాల నుంచి బయటపడేందుకు..
ప్రతి పంటలో ఎదురవుతున్న పంట నష్టాల నుంచి బయట పడేందుకు రైతులు సామర్థ్యానికి మించి సీడ్ కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ఎకరా విస్తీర్ణానికి 30 వేల నుంచి 40 వేల వరకు రొయ్య పిల్లలను గుంతల్లో వదలవచ్చు. అయితే నకిలీ సీడ్ కారణంగా సర్వైవల్ ఉండడం లేదని రైతులు రెండింతలకు పైగా అంటే సుమారు ఎకరాకు లక్షకు పైగా సీడ్ వదులుతున్న పరిస్థితి. ఆక్వా సాగు ప్రారంభంలో టైగర్ రొయ్యల సీడ్‌ను ఎకరాకు 15 వేల నుంచి 20 వేల వరకు వదిలేవారు. గుంతల్లో డెన్సిటీ తక్కువగా ఉండడంతో గ్రోత్ (కౌంట్ సైజ్) బాగా ఉండేది. రానురాను సీడ్ నాణ్యత తగ్గిపోవడంతో లక్షల్లో సీడ్‌ను వదిలి పెట్టేవారు. నకిలీ సీడ్ కారణంగా ఏకంగా రాష్ట్రంలోనే టైగర్ రొయ్యల సాగు పూర్తిగా కనుమరుగు అయిపోయింది. ఈ దశలో ఎంపెడా విదేశాల నుంచి వెనామీ తీసుకువచ్చింది. ప్రస్తుతం వెనామీ పరిస్థితి కూడా టైగర్ బాటలోనే కనుమరుగు దశకు చేరుకుంటోందని ఆక్వా నిపుణులు చెబుతున్నారు.

ఊపిరి తీస్తున్న ఫీడ్ కంపెనీలు, వ్యాపారులు
ఫీడ్ కంపెనీలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా ముంచేయడంతో ఆక్వా రంగం జిల్లాలో కొన ఊపిరితో కునారిల్లుతోంది. వ్యాపారులే మార్కెటింగ్ ఏజెంట్లను పెట్టుకుని.. వీరే టెక్నీషియన్లు అని చెప్పి ఫీల్డ్‌లోకి పంపిస్తోంది. వీరికి కనీస పాటి అవగాహన కూడా ఉండడం లేదు. వీరు అవసరం లేకపోయినా.. గ్రోత్ కోసం, జీర్ణశక్తి మెరుగు పరిచేందుకు, బాక్టీరియా, అమోనియా లోడ్ కంట్రోల్, విటమిన్ సీ, మినరల్స్, మౌల్టింగ్ త్వరగా అయ్యేందుకు, ఆక్సిజన్ వినియోగం పెరిగేందుకు అంటూ ఇలా రకరకాల పేర్లతో మందులు అంటగడుతున్నారు. ఆక్వా ఫీడ్ తయారీలో పేరెన్నికగన్న సంస్థలు కూడా సీజన్‌ను, డిమాండ్‌ను బట్టి నాసిరకం మేతలు సరఫరా చేస్తున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు. నాణ్యత లేని సీడ్, వాతావరణ మార్పుల కారణంగా ఎదుగుదల ఏ మాత్రం నెమ్మదించినా విపరీతంగా మందులు వాడుతున్నారు. చివరకు దుకాణాల్లో అప్పులు పెరిగి ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితికి చేరుకుంటున్నారు.

నెల్లూరు, కోవూరు కేంద్రంగా నకిలీ ఉత్పత్తులు

కొందరు వ్యాపారులు నెల్లూరు, కోవూరు పరిసర ప్రాంతాల్లో అద్దె భవనాలు ఏర్పాటు చేసుకుని ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల నుంచి సరుకులు (నాణ్యత లేనివి) తీసుకువచ్చి గోడౌన్లలో అందమైన కవర్లు, డబ్బాల్లో ప్యాక్ చేసి రైతులకు అంటగడుతున్నారు. తీరం వెంబడి ఆక్వా సాగు చేసే గ్రామాల్లోనే మేత, మందులు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సీడ్ దగ్గర నుంచి మేత, మందులు, జనరేటర్లు, డీజిల్ వరకు చిన్న రైతులకు అప్పుగా ఇస్తున్నారు. పంట పట్టుబడికి వచ్చిన తర్వాత వీళ్లే రొయ్యలు విక్రయించి తమ బాకీ జమ చేసుకుని మిగిలిన సొమ్ము రైతులకు ఇస్తున్నారు.

నకిలీ సీడ్‌తో తీవ్ర నష్టాలు



వెనామీ రొయ్యల పెంపకంలో విపరీతంగా ఖర్చులు, కష్టాలు పెరిగాయి. వైరస్ వ్యాప్తి కూడా అధికంగా ఉంది. కొనుగోలు ధరలు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఈ సమస్యలతో సతమతమవుతుంటే ఎన్నడూ లేని విధంగా నకిలీ సీడ్ ఉత్పత్తి చేస్తూ కొన్ని హేచరీలు రైతులకు తీవ్ర నష్టాలు కలిగిస్తున్నాయి.

– సన్నారెడ్డి మధురెడ్డి, ఆక్వా రైతు, గుడివాడతోపు

మత్స్యశాఖ చర్యలు తీసుకోవాలి



నకిలీ సీడ్ ఉత్పత్తి చేస్తూ మాయ మాటలతో అమ్మకాలు చేసే హేచరీలపై మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. మూడు నెలల పెంపకంలో ఎదుగుదల కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు సీడ్, ఫీడ్, ఖర్చులకు వెచ్చించిన డబ్బు తిరిగి ఇప్పించాలి. ప్రభుత్వ అనుమతి లేని హేచరీలను మూయించి వేయాలి.

– కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆక్వా రైతు, పోలంరాజుగుంట

తనిఖీలు చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా హేచరీస్‌లో నకిలీ సీడ్స్‌పై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. ముత్తుకూరు మండలంలోని రైతులు నష్టపోయారని తమ దృష్టికి వచ్చింది. విచారణ చేశాం. నకిలీ సీడ్స్‌పై తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతాం.

– నాగేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ, నెల్లూరు

న్యూస్‌రీల్

జెడ్పీ సమావేశం వాయిదా



చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను సన్మానిస్తున్న మహిళా జిల్లా అధికారులు

నెల్లూరు (పొగతోట): కోరం లేని కారణంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శనివారం సర్వసభ్య సమావేశ నిర్వహణకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ విద్యారమ షెడ్యూల్ ప్రకటించారు. అయితే శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో జెడ్పీ సభ్యులు, మంత్రులు హాజరు కాలేదు. కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ ప్రకటించారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని, వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి పరిమళ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి శోభారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

నంబరు ప్లేట్లు, బ్లాక్ ఫిల్మ్‌పై తనిఖీలు



తనిఖీలు చేస్తున్న రవాణా అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (టౌన్): వాహనాలపై నంబర్ ప్లేట్లు, కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లపై రవాణా శాఖాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. బైక్‌ల నుంచి కార్ల వరకు రవాణాశాఖ నిబంధనలు ధిక్కరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఈ నెల 6వ తేదీ సాక్షిలో 'అడిగేదమ్ముందా?!' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో బృందాలుగా ఏర్పడి నిబంధనలు అతిక్రమించిన పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ప్రధానంగా నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి నంబరు ప్లేట్లు, బ్లాక్ ఫిల్మ్, ద్విచక్ర వాహనదారుల నంబరు ప్లేట్లుపై తనిఖీలు చేశారు. దాదాపు 100 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 2 లక్షల మేర అపరాధ రుసుం విధించారు. ఇన్‌చార్జి ఆర్టీఓ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ రవాణా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు ఎండీ రఫీ, కార్తీక్, బాబు, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య ఫ్లెక్సీల రగడ



కింద పడవేసిన ఎంపీ వర్గీయుల ఫ్లెక్సీ

గుడ్లూరు: నియోజకవర్గంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వర్గీయుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. గుడ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఎంపీ వర్గీయులు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఎంపీ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పక్క పడేసి, ఆ స్థానంలో ఎమ్మెల్యే వర్గీయులు మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆదివారం వీపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ట్రై సైకిళ్ల పంపిణీ ఉంది. ఈ నేపథ్యంలో ఎంపీ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చూసి ఎమ్మెల్యే వర్గీయులు జీర్ణించుకోలేక పడేయటం చర్చనీయాంశమైంది.

వైఎస్సార్‌సీపీలోనే మహిళలకు గౌరవం



కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ మహిళలు



ఆనం అరుణమ్మను సత్కరిస్తున్న కాకాణి, ఆనం, పర్వతరెడ్డి తదితరులు

- రాజ్యాధికారం, సంక్షేమంతో సముచిత స్థానం కల్పించిన వైఎస్ జగన్
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళలను సత్కరించిన పార్టీ నేతలు కాకాణి, ఆనం, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు రాజ్యాధికారంలో సముచిత గౌరవాన్ని కల్పించారని, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాధికారతకు తోడ్పాటు అందించారని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు గుర్తు చేశారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మహిళలను అన్ని విధాలుగా మోసం చేస్తోందని విమర్శించారు. శనివారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీసునంద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మహిళలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను పార్టీ నాయకులు సత్కరించారు.

మహిళా పక్షపాతి వైఎస్ జగన్ : కాకాణి
రాజ్యాధికారంలో మహిళలకు అత్యున్నత స్థానం కల్పించడంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరించారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. మహిళల గురించి, వారికి అందించిన సంక్షేమ పథకాల గురించి మాట్లాడుకునే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. మహిళా దినోత్సవానికి సంబంధించి ర్యాలీని ఆశా, అంగన్‌వాడీ వర్కర్లతో జరుపుకునే దుస్థితి టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఏర్పడిందన్నారు. ఆడబిడ్డ నిధి అడ్రస్ లేకుండా పోయిందన్నారు. ఉచిత గ్యాస్ తుస్సుమందని, చంద్రబాబు పేరు చెప్పి బస్సు ఎక్కితే ఎక్కిన చోటే దించేస్తున్నారని చెప్పారు.

➡ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళ అని మహిళలు లేకుంటే ప్రపంచమే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పురుషులతోపాటు మహిళలకు సమాన హక్కు ఇచ్చి తీరాలన్న ఉద్దేశంతోనే వారికి స్థానిక సంస్థల్లో 50 శాతం కేటాయించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని వారి సంక్షేమం కోసం పోరాటం చేస్తుందన్నారు.

➡ ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బాధ్యతకు మారు పేరు మహిళ అని కొనియాడారు. విద్యలో మహిళలే అధిక శాతం ఉత్తీర్ణత సాధించడం జరుగుతుందన్నారు. రాజకీయాల్లో కూడా మహిళలు తమవంతు పాత్ర పోషిస్తున్నారన్నారు.

➡ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందాలని, హక్కులను కాపాడాలని, ఈ లక్ష్యాన్ని సాధించడానికి మహిళాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

➡ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీసునంద మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం వంద రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. మహిళలు అన్ని విధాలుగా సంతోషంగా ఉండాలంటే భవిష్యత్తులో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకురాళ్లు పూజితారెడ్డి, కార్పొరేటర్ మొయిళ్లగౌరి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లతోపాటు పలువురు పాల్గొన్నారు.

రాసుకునోళ్లకు రాసుకున్నంత!

- ఇంటర్ పరీక్షల ప్రారంభం నుంచి అదే తంతు
- పరీక్ష కేంద్రం వద్ద కుప్పలు కుప్పలుగా మైక్రో జెరాక్స్ చిట్టీలు
- మొక్కుబడిగా తనిఖీలు.. చూసీచూడని వైఖరి



టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద పడేసిన ఓ చాప్టర్ మైక్రో జెరాక్స్ చిట్టీలు

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు చూసి రాత పరీక్షలుగా మారాయి. శనివారం జరిగిన మ్యాథ్స్ 1–బీ పరీక్షకు సంబంధించిన చిట్టీలు, మైక్రో జెరాక్స్‌లు కళాశాల గేటు వద్ద, ప్రహరీ పక్కన కనిపించాయి. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి చిట్టీలు కనిపిస్తున్నాయి. ఒక సబ్జెక్ట్ చాప్టర్‌నే మైక్రో జిరాక్స్ తీయించి దారం కట్టి తెచ్చారు. ప్రశ్నపత్రం బయటకెళ్లాక మైక్రో జెరాక్స్‌లు వస్తున్నాయనేది అనుమానంగా ఉంది. కళాశాల కిటికీలు, ప్రహరీల పక్కన, గేటు వద్ద మైక్రో జెరాక్స్‌లు ఆ అనుమానాలను ధృవపరుస్తున్నాయి.

తనిఖీ అధికారులు ఏం చేస్తున్నట్లు?
మ్యాథ్స్, బోటని, జువాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించిన చిట్టీలు ఆ కళాశాల ప్రాంగణంలో బయట పడుతున్నాయి. పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చే ముందే గేటు వద్ద పోలీసులు, కళాశాల సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంటే.. ఈ చిట్టీలు ఎలా వస్తున్నాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. దీన్ని బట్టి విద్యార్థులు చిట్టీలతో వెళ్తున్నా పట్టించుకోవడం లేదనుకోవాలి. లేదా పరీక్ష ప్రారంభం అయిన తర్వాత పేపర్ బయటకు వెళ్లి.. ఆన్సర్లు మైక్రో జెరాక్స్‌ల రూపంలో అయినా వస్తుండాలి. పరీక్ష కేంద్రంలో చిట్టీలు పెట్టి రాస్తుంటే పరీక్ష కేంద్రం చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారి ఏం చేస్తున్నారని మరికొందరు విద్యార్థులు నిలదీస్తున్నారు. దీనిపై ఆర్‌ఐఓ శ్రీనివాసులను వివరణ కోరగా ఈ పరీక్ష కేంద్రంపై ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. సిట్టింగ్ స్క్వాడ్ కూడా ఏర్పాటు చేశాం. రేపటి నుంచి ఇంకా కఠినంగా చర్యలు తీసుకుంటాం. చిట్టీలు జరుగుతున్నాయంటే చర్యలు తప్పక తీసుకుంటాం.

లోక్ అదాలత్‌లో 32,848 కేసుల పరిష్కారం

- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మొదటి స్థానం

నెల్లూరు (లీగల్) ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 32,848 కేసులు పరిష్కరించి, రూ.2,64,53,501 చెల్లింపులు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని ఆరో జిల్లా కోర్టు హాల్‌లో న్యాయమూర్తి కె. వెంకటనాగపవన్‌కుమార్ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. నెల్లూరు నగరంలో కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా 5 బెంచ్‌లను ఏర్పాటు చేసి న్యాయమూర్తులు కె. వెంకటనాగపవన్, ఎస్. శ్రీనివాస్, గోరంట్ల స్వాతి, ఎల్.శారదరెడ్డి, ఎస్.లావణ్య, ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 14,208 కేసులు పరిష్కరించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో లోక్‌అదాలత్ జరిగింది. గూడూరు 341, కోవూరు 3,976, కావలి 2,615, వెంకటగిరి 2,601, కోట 300, నాయుడుపేట 55, సూళ్లూరుపేట 1,164, ఆత్మకూరు 2,168, ఉదయగిరి 1,550 కేసులు పరిష్కరించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, పలువురు న్యాయమూర్తులు, పోలీసు, బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి వెంకట నాగపవన్‌కుమార్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



నగదు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహ్మద్ ఫరూక్
- కస్తూర్బాలో ఘనంగా మహిళా దినోత్సవం

నెల్లూరు(అర్బన్): మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించి అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహ్మద్ ఫరూక్ అన్నారు. శనివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత సెల్ఫీ బూత్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాధి పథకాలు అందిస్తున్నామన్నారు.

మహిళలకు రూ.440 కోట్ల రుణాలు
మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రకాల పథకాల ద్వారా రూ.440 కోట్ల మేర రుణాల పంపిణీకి సంబంధించి మంత్రి మహ్మద్ ఫరూక్, కలెక్టర్ ఆనంద్ మెగా చెక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ట్రైకార్ డైరెక్టర్ అనూరాధ, డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ శాఖల పీడీలు నాగరాజకుమారి, రాధమ్మ, సుశీల, డీఎంహెచ్‌ఓ సుజాత, పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, హ్యాండ్లూమ్స్ ఏడీ వరప్రసాద్, పలువురు జిల్లా అధికారులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

నెల్లూరు పరిధిలోని జాతీయ రహదారి శనివారం రక్తసిక్త మైంది. వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత పడగా, పది మంది గాయపడ్డారు. ఈ ఘటనలు ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి.

– నెల్లూరు(క్రైమ్)

జాతీయ రహదారి రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- మృతులు విడవలూరు, ముత్తుకూరు, సూర్యాపేట వాసులు
- పది మందికి గాయాలు


నుజ్జునుజ్జయిన ఆటో


శ్రీరాములు, అయోధ్య రామయ్య మృతదేహాలు



రిసెప్షన్‌కు వెళ్లొస్తూ అనంతలోకాలకు

విడవలూరు మండలం మన్మథరావుపేటకు చెందిన ఆయోధ్య రామయ్య(55) బంధువులకు అదే ప్రాంతంలో ఇటీవల వివాహమైంది. ఈ క్రమంలో నెల్లూరులోని అంబాపురంలో రిసెప్షన్‌ను శుక్రవారం నిర్వహించారు. దీంతో ఆయోధ్య రామయ్య, తన బంధువులైన కామాక్షినగర్‌కు చెందిన శ్రీరాములు (74), అల్లూరు మండలం యర్రపుగుంటకు చెందిన శ్రీనివాసులు, పద్మ దంపతులు, కుమారుడు మధుసూదన్, విడవలూరు మండలం పటేల్‌నగర్‌కు చెందిన నరసింహులు, రాజేశ్వరి దంపతులు, బంధువు భవానితో కలిసి తన ఆటోలో అంబాపురానికి వెళ్లారు. అనంతరం విడవలూరుకు అర్ధరాత్రి బయల్దేరారు. సుందరయ్య కాలనీ సమీపంలోని మలుపు వద్ద చెన్నై వైపు నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఆటో బోల్తాపడటంతో ఆయోధ్య రామయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన వారు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సాయంతో నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీరాములు శనివారం మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మధుసూదన్, నరసింహులును మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై తరలించారు. నగరంలోని జీజీహెచ్‌లో శ్రీనివాసులు, పద్మ, రాజేశ్వరి, భవాని చికిత్స పొందుతున్నారు. మధుసూదన్ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

రైల్లో వెళ్లాలనుకొని.. ఇన్నోవాలో బయల్దేరి

భగత్‌సింగ్‌కాలనీ జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన అక్కా, తమ్ముడు మృతి చెందగా, వారి తల్లిదండ్రులు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన మల్లయ్య, నాగమణి దంపతులకు నిషిత (22), కార్తీక్ (20) సంతానం. సూర్యాపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ, కుమార్తెను బీటెక్ ఫైనలియర్, కుమారుడ్ని డిప్లొమా చదివిస్తున్నారు. తన కుటుంబంతో కలిసి తిరుమలకు ఈ నెల ఆరున వెళ్లారు. దర్శనానంతరం తిరిగి తమ ఊర్లెళ్లేందుకు గానూ తిరుపతికి శుక్రవారం అర్ధరాత్రి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు బయల్దేరగా, మార్గమధ్యలో ఇన్నోవా డ్రైవర్ తాను విజయవాడ వెళ్తున్నానని చెప్పారు. దీంతో వీరు అందులో బయల్దేరారు. భగత్‌సింగ్ కాలనీ జంక్షన్ వద్దకొచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొని, ఆపై చెన్నై వైపు వెళ్లే జాతీయరహదారిపై గుర్తుతెలియని లారీని ఢీకొన్నారు. ఘటనలో నిషిత, కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా, తల్లిదండ్రులు, డ్రైవర్ శివరామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సాయంతో మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై బలరామిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన అక్కా, తమ్ముడు

కంటైనర్‌ను ఢీకొనడంతో..


రవికుమార్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): జాతీయ రహదారిపై కంటైనర్‌కు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కుమారుడు మృతి చెందగా, తల్లి అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరుకు చెందిన కొండమ్మ, తన కుమారుడు రవికుమార్ బైక్‌పై గూడూరు వైపు శనివారం బయల్దేరారు. సౌత్ రాజుపాళెం జంక్షన్ వద్దకొచ్చేసరికి ముందు వెళుతున్న కంటైనర్‌కు డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశారు. దీంతో బైక్ ఢీకొనడంతో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే రవికుమార్ మృతి చెందారు. కొండమ్మ అపస్మారక స్థితిలో ఉన్నారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి సెల్‌ఫోన్‌ను అన్‌లాక్ చేసి అందులోని నంబర్లకు ఫోన్ చేసి కుటుంబసభ్యులకు సమాచారం అందించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు అదుపుతప్పి మహిళ దుర్మరణం

- ముగ్గురికి గాయాలు



మర్రిపాడు: కారు అదుపుతప్పి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఢీకొనడంతో మహిళ మృతి చెందగా, ముగ్గురు గాయపడిన ఘటన మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై కండ్రిక సెంటర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఆత్మకూరు నుంచి మర్రిపాడుకు వెళ్తున్న కారు మార్గమధ్యలో ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన పల్లవోలుకు చెందిన సుజాతమ్మ (55)ను మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా వాశిలి సమీపంలో మృతి చెందారు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఘటన స్థలాన్ని ఎస్సై శ్రీనివాసరావు, ఎమ్వీఐ రాములు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

పొదలకూరు: బైక్ ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని మనుబోలు రోడ్డు నిమ్మ మార్కెట్ యార్డు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్సై హనీఫ్ వివరాల మేరకు.. నిమ్మ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన జయంతిశక్తి రోడ్డుపై వెళ్లసాగారు. ఈ క్రమంలో సైదాపురం మండలం దేవరవేమూరుకు చెందిన శంకరయ్య మద్యం మత్తులో బైక్‌ను నడుపుతూ ఆమెను ఢీకొన్నారు. క్షతగాత్రురాలిని 108లో ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ తీరుతో పేదల ఇబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలబిస్తున్న వైఖరితో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీరి సమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్రలను సాగిస్తున్నామని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో ప్రజా చైతన్య యాత్రలను శనివారం ప్రారంభించారు. డివిజన్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజాసమస్యలను ఆరాతీసి అర్జీలను స్వీకరించారు. అనంతరం వీరు మాట్లాడారు. పెన్నా పక్కనే ఉన్నా, కుళాయిల్లో మంచినీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రేషన్ కార్డులు, పింఛన్ల కోసం నిరీక్షిస్తూ.. అధిక విద్యుత్ చార్జీలు చెల్లించలేక ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు.


ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం నేతలు

సర్వే పేరుతో అర్హుల పేర్లను తొలగించి సంక్షేమ పథకాలకు కోత విధించడం తగదన్నారు. సమీక్షల పేరుతో కాలయాపన చేస్తూ, ప్రజా సమస్యలను మంత్రి నారాయణ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు మస్తాన్‌బీ, నాగేశ్వరరావు, నేతలు మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, షకీలా, కత్తి పద్మ, జాఫర్, బయ్యన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాల్లో పేద మహిళలు ఆర్థికంగా ఎదగాలని పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ కాంక్షించారు. కృష్ణపట్నంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి తన సతీమణి చాందినీ పటేల్‌తో కలిసి హాజరైన ఆయన మాట్లాడారు. గ్రామీణ మహిళలు సంతోషంగా, గర్వంగా జీవనం సాగించాలని, దీనికి అదానీ ఫౌండేషన్ కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ – ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ.ఐదు లక్షల చెక్కును మహిళా గ్రూప్ లీడర్‌కు అందజేశారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సరళ తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న జగదీష్ పటేల్

వైఎస్సార్‌సీపీ నుంచి సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్



కావలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ నేత మన్నెమాల సుకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడుతున్నారనే అంశంపై ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపింది.

వైఎస్సార్‌సీపీలో పలువురి నియామకం

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన పలువుర్ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను శనివారం విడుదల చేసింది. బీసీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా పెయ్యల వెంకటరమేష్‌యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా కేశాయి శ్యామ్‌సింగ్, బుచ్చంగారి తిరుపతయ్య నియమితులయ్యారు. వాణిజ్య విభాగ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా అమరా వెంకటయాదగిరిగుప్తా, సెక్రటరీగా కొండా రాజగోపాల్‌రెడ్డి, ఇంటలెక్చువల్స్ ఫోరమ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యంరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడ్ని నియమించారు. ఇంటలెక్చువల్స్ ఫోరమ్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా పఠాన్ సమీర్‌ఖాన్, జాయింట్ సెక్రటరీగా కల్లూరి జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు.

ఏఎన్‌ఎంల పదోన్నతుల జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పదోన్నతుల కోసం జిల్లాలో పనిచేస్తున్న సచివాలయ ఏఎన్‌ఎం గ్రేడ్ – 3 (ఎంపీహెచ్‌ఏ – ఎఫ్) ఎంపిక జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ సుజాత శనివారం తెలిపారు. జాబితాను spsnellore. ap. gov.inలో ఉంచామని చెప్పారు. పదోన్నతులు పొందిన వారికి కౌన్సెలింగ్‌ను ఈ నెల 13న నిర్వహించనున్నామని వెల్లడించారు. కౌన్సెలింగ్‌లో ప్రాధాన్యం కోసం అభ్యర్థులకు ఏమైనా ఇతర అర్హతలుంటే, సర్టిఫికెట్లను కార్యాలయంలో ఈ నెల పదిలోపు అందజేయాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 721 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 721 మంది శనివారం గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 25174 మందికి గానూ 24617 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1385 మందికి గానూ 164 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులుతో పాటు డీవీఈఓ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

నిమ్మ ధరలు	పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
పెద్దవి: రూ.70	బ్రాయిలర్ (లైవ్) :	92
సన్నవి: రూ.50	లేయర్ (లైవ్) :	90
పండ్లు: రూ.35	బ్రాయిలర్ చికెన్ :	170
	బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	190
	లేయర్ చికెన్ :	153

ఇసుకకు తాపత్రయం.. అన్నదాతలకు శాపం

- సంగం బ్యారేజీలో డ్రెడ్జింగ్‌కు నీరు నిల్వ
- బీరాపేరు నీటితో వందెకరాల్లో మునిగిన వరి
- ఆందోళనలో అన్నదాతలు

సంగం: ఇసుకాసురుల తాపత్రయం అన్నదాతలకు శాపంగా పరిణమిస్తోంది. సంగం బ్యారేజీ దిగువ భాగంలో ఇసుక డ్రెడ్జింగ్ కోసం ఎగువ భాగంలో నీటిని అలానే నిల్వ ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఇది సమీపంలోని బీరాపేరులోకి చేరి చెంతనే ఉన్న పొలాలను ముంచెత్తుతోంది. ఈ పరిణామంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

రైతులకు నరకం

అన్నదాతలకు ప్రత్యక్ష నరకాన్ని కూటమి ప్రభుత్వం చూపుతోంది. సంగం సమీపంలోని బీరాపేరు వద్ద వందెకరాలకుపైగా సాగు భూములున్నాయి. ఇందులో రైతులు బీపీటీ రకం వరిని పండిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో వీరి పంటలు పాడైపోయేలా ఉన్నాయి. పెన్నాలో పడవతో ఇసుక డ్రెడ్జింగ్‌కు సంగంతో పాటు పొదలకూరు మండలంలోని సూరాయపాళేన్ని ఎంచుకోవడం ఇక్కడి రైతులకు ఇబ్బందిగా మారింది.


బీరాపేరులో ప్రవహిస్తున్న నీరు

ఇక్కడ పడవల ద్వారా ఇసుకను సేకరించాలంటే సంగం బ్యారేజీ వద్ద 13.2 అడుగుల మేర నీటిమట్టాన్ని ఉంచాలి. ఆ మేరకు నీటిమట్టాన్ని ఉంచడంతో బీరాపేరు వాగులోకి నీరు అధికంగా చేరి పక్కనే ఉన్న రైతుల పొలాల్లోకి చేరుతోంది. దీంతో ఇప్పటికే కోత దశకొచ్చిన వందెకరాలకుపైగా వరి పంట దెబ్బతింటోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నీటమునిగిన వరి

డ్రెడ్జింగ్‌తో నష్టం



అధికారులకు పది రోజుల క్రితమే తెలియజేసి పరిష్కారం చూపాలని కోరా. ఇసుక డ్రెడ్జింగ్‌తో నా గోడును పట్టించుకోలేదు. వందెకరాల పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది.

– కొరిమెర్ల శ్రీనివాసచౌదరి, రైతు, సంగం

20 ఎకరాల్లో నీటి నిల్వ



బీరాపేరు వద్ద కౌలుకు తీసుకొని పొలాల్లో 20 ఎకరాల్లో బీపీటీ రకం వరిని సాగు చేశా. పది రోజుల్లో పంట కోత కోయాలి. సంగం బ్యారేజీ బ్యాక్ వాటర్ పొలంలోకి వారం రోజులుగా వచ్చి చేరుతోంది. దీంతో పెట్టిన ఖర్చులూ వచ్చేలా లేవు.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, సంగం